# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
23-3-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 5

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## జీవన్ రెడ్డి వ్యూహం ఏంటి?



**దాదాపు కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పినట్టే**

**లైట్ తీసుకుంటున్న హస్తం**

**భవిష్యత్తులో దెబ్బ ఖాయం అంటున్న విశ్లేషకులు**

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు హాట్ టాపిక్ జీవన్ రెడ్డి. తాను ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ పార్టీపై ఆయన అలక వహించారు. అసంతృప్తి ప్రదర్శించారు. గులాబీ పార్టీలో చేరేందుకు సిద్ధపడ్డారు. అయితే ఆయన విషయంలో కాంగ్రెస్ పార్టీ లైట్ తీసుకుంది.

వెళ్ళిపోతే వెళ్ళిపొండి అన్నట్టు వదిలేసింది. ఒకరిద్దరి నేతలతో రాయబారం పంపించింది. కానీ అది వర్క్ అవుట్ అయ్యేలా లేదు. అయితే ఇప్పటికిప్పుడు జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి తీసుకొచ్చే ఇబ్బందులు ఏమీ లేవు కానీ.. వచ్చే ఎన్నికల నాటికి జీవన్ రెడ్డి తప్పకుండా ప్రభావం చూపగలరు. గతంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విషయంలో ఇదే మాదిరిగా లైట్ తీసుకుని దెబ్బతింది గులాబీ పార్టీ. ఇప్పుడు జీవన్ రెడ్డి నుంచి కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో

- మిగతా 3వ పేజీలో

## గ్రేటర్‌పై కమలం కన్ను!



**మూడు నగరాలను కైవసం చేసుకోవాలని నిర్ణయం**

**వచ్చే నెలలో ప్రధాని మోదీ పర్యటన**

**గట్టి వ్యూహంతో బిజెపి**

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో

“ గ్రేటర్ హైదరాబాద్ పై బిజెపి దృష్టి పెట్టిందా? బల్దియా ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తోందా? మూడు నగరాలను కైవసం చేసుకోవాలని భావిస్తోందా? అందులో భాగమే ప్రధాని మోదీ పర్యటన? తెలంగాణ పొలిటికల్ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. భాగ్యనగరం అంటే నిజంగా భాగ్యనగరమే. తెలంగాణ రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉంది భాగ్యనగరం.

“ అటువంటి నగరంలో పట్టు సాధించడం ద్వారా 2028 అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది భారతీయ జనతా పార్టీ. అందుకే బల్దియా ఎన్నికల్లో కాషాయాన్ని విస్తరించి..

2లో

## ప్రభుత్వాధినేతగా 8,931 రోజులు!

**చరిత్ర సృష్టించిన మోదీ**

## అవగాహనలేమితో తెలంగాణ పరువు తీస్తున్నాడు

**సీఎం రేవంత్ వ్యాఖ్యలపై హరీశ్ మండిపాటు**



హైదరాబాద్: పటాన్‌చెరులో 1972 నుంచి ప్రపంచ స్థాయిలో పనిచేస్తున్న అంతర్జాతీయ సంస్థ ఇక్రిశాట్‌ను అమెరికా సంస్థ లేదా అమెరికా రీసెర్చ్ సెంటర్ అని పిలవడం సీఎం రేవంత్‌రెడ్డి అవగాహన రాహిత్యానికి పరాకాష్ట అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లా పర్యటనలో ే


## తీవ్ర అసంతృప్తితో ముద్రగడ!



**జగన్ తీరుపై తీవ్ర ఆగ్రహం**

**గోదావరి జిల్లాల బాధ్యతలను అడిగిన పద్మనాభం**

**తిరస్కరించిన వైసీపీ అధినేత**



క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ముద్రగడ పద్మనాభం అసంతృప్తితో ఉన్నారా? జగన్మోహన్ రెడ్డి పై ఆగ్రహంతో రగిలిపోతున్నారా? వైసీపీలో తనకు ప్రాధాన్యం ఇవ్వకపోవడాన్ని ఆయన సహించుకోలేకపోతున్నారా? తీవ్ర నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు

- మిగతా 3వ పేజీలో



**ఆ ఒక్క తప్పిదంతో మంత్రి పదవికి**


## బుచ్చయ్య చౌదరి దూరం!

- 1995 సంక్షోభంలో చంద్రబాబుకు వ్యతిరేకంగా గోరంట్ల..
- తిరిగి ఆలస్యంగా టిడిపిలోకి చేరిక
- పదవులకు దూరం అయిన సీనియర్ నేత

క్రైమ్ మిర్రర్, ఆంధ్రప్రదేశ్ బ్యూరో

ఏపీలో మంత్రివర్గ విస్తరణ పై అనేక రకాల ఊహాగానాలు వస్తున్నాయి.

2లో



## శ్రీలంకలో ఇంధన మంటలు


**25% మేర ధరలు పెంచిన ప్రభుత్వం**

## అరాద్, డిమోనా నగరాలపై ఇరాన్ దాడులు

- నతాంజ్ అణు కేంద్రంపై దాడికి ప్రతీకారం
- అడ్డుకోవడంలో విఫలమైన ఇజ్రాయెల్ ఎయిర్ డిఫెన్స్
- 180 మందికి గాయాలు, పలువురి పరిస్థితి విషమం
- గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపైనా ఇరాన్ దాడులు
- ఉత్తర ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా తీవ్ర దాడులు, ఒకరి మృతి

దుబాయ్/టెహ్రాన్/జెరూసలేం: పశ్చిమాసియా యుద్ధ జ్వాలలు నానాటికీ విస్తరిస్తున్నాయి. దాడులు, ప్రతిదాడులతో ఇరాన్, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలు

3లో





2లో


## ఏపీలో నంది అవార్డులు!

- సన్నాహాలు ప్రారంభించిన ఏపీ ప్రభుత్వం
- మెగాస్టార్ చిరంజీవి వినతిపై సానుకూల నిర్ణయం
- విశాఖ వేదికగా ప్రదానం

క్రైమ్ మిర్రర్, ఆంధ్రప్రదేశ్ బ్యూరో : ఏపీలో నంది అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం

## నేడే రైతు భరోసా నిధులు

- రైతుల ఖాతాల్లోకి జమ కానున్న పెట్టుబడి సాయం
- సిద్దిపేట జిల్లా నర్మెట్టలో విడుదల చేసిన ముఖ్యమంత్రి
- ఈసారి మూడు విడతలుగా రైతు భరోసా నిధులు
- తొలి విడతలో 70 మందికి రూ.3600 కోట్ల సాయం



తెలంగాణ రైతులకు గుడ్ న్యూస్. యాసంగి సీజన్ కు సంబంధించి రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం ఈ నిధులను విడుదల చేశారు. సోమవారం రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. ఈసారి మూడు విడతల్లో



# ఏపీలో నంది అవార్డులు!

(మొదటి పేజీ తరువాయి)

గద్దర్ అవార్డులను ప్రధానోత్సవం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ వేదికపై మెగాస్టార్ చిరంజీవి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఏపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మెగాస్టార్ వ్యాఖ్యలు చేశారంటూ ఎక్కువమంది ఆయన తీరును తప్పుపట్టారు. కానీ ఏపీ ప్రభుత్వం మాత్రం సానుకూలంగా తీసుకుంది. అందుకే త్వరలో నంది అవార్డులను అందించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఈ విషయాన్ని ప్రకటించారు. ఒక జ్యూరీ కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు. టెలివిజన్, సినీ రంగాలకు చెందిన వ్యక్తులకు నంది అవార్డులను ప్రదానం చేయనున్నారు.

### గద్దర్ అవార్డుల ప్రదానం

తెలంగాణలో గద్దర్ అవార్డుల పేరిట ప్రదానోత్సవం పూర్తయింది. ఇదే వేదికపై చిరంజీవి తో పాటు ఆర్.నారాయణమూర్తి ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. ఏపీ ప్రభుత్వం కూడా నంది అవార్డులు ఇవ్వాలని కోరారు. అయితే చిరంజీవికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో దీనిపై విమర్శలు వచ్చాయి. కానీ ఏపీ ప్రభుత్వం మాత్రం ఆ వివాదాస్పద అంశాల జోలికి పోలేదు. చిరంజీవి విన్నపాన్ని సానుకూలంగా తీసుకుంది. అందుకే నంది అవార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. వాస్తవానికి 2017లో టిడిపి ప్రభుత్వం నాలుగు సంవత్సరాల కు సంబంధించి నంది అవార్డులను ప్రకటించింది. కానీ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ ప్రయత్నం చేయలేదు. ఐదు సంవత్సరాల పాటు నంది అవార్డుల జోలికి పోలేదు.

### విశాఖ నుంచి ఇవ్వాలని..

విశాఖ వేదికగా నంది అవార్డులను అందించే అవకాశాలను కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది. అయితే విజయవాడ కంటే విశాఖలో సినిమా షూటింగ్లకు అనుకూలం. అందుకే విశాఖలో నంది అవార్డులు ఇవ్వడం ద్వారా సినీ పరిశ్రమ పెద్దల నుంచి ఇక్కడ నుంచి షూటింగులు జరిగేలా ప్రకటిస్తారని తెలుస్తోంది. ఇప్పటికే సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఎమ్మెల్సీ నాగబాబును సంప్రదించి జ్యూరీ కమిటీని ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది.

### ఆ విమర్శలు రాకూడదని..

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నంది అవార్డుల ప్రస్తావన వచ్చింది. కానీ చిత్ర పరిశ్రమకు చెందిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఆపై హిందూపురం ఎమ్మెల్యేగా నందమూరి బాలకృష్ణ ఉన్నారు. ఎమ్మెల్సీగా నాగబాబు కొనసాగుతున్నారు. 2017లో టిడిపి ప్రభుత్వం నంది అవార్డులను ప్రధానం చేస్తే చిత్ర పరిశ్రమ వ్యక్తులు చాలామంది విమర్శలు చేశారు. తమ వారికే అవార్డులు ఇచ్చుకున్నారని విమర్శించారు. మరోసారి ఆ పరిస్థితి రాకూడదని భావించి నంది అవార్డుల జోలికి వెళ్లలేదు ఏపీ ప్రభుత్వం. అయితే సినీ పరిశ్రమ పెద్దల నుంచి విజ్ఞప్తి రావడంతో ఏపీ ప్రభుత్వం ఇప్పుడు నంది అవార్డుల ప్రదానానికి సిద్ధమయింది.

# శ్రీలంకలో ఇంధన మంటలు



కొలంబో: పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో శ్రీలంక ప్రభుత్వం ఆదివారం ంధన ధరలను 25 శాతం మేర పెంచింది. ఈ పెంపు వారంలో రెండోసారి కాగా, మార్చి ఒకటో తేదీ తర్వాత మూడోసారి కావడం గమనార్హం. నూతన ధరలు ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో, కనీసం 20 శాతం మేర ఇంధన వినియోగం తగ్గుతుందని అంచనాలున్నాయి. ఆటో డీజిల్ లీటరు ధర ప్రస్తుతమున్న రూ.303 నుంచి 26.1 శాతం మేర పెరిగి రూ.382కు చేరుకుంది. సూపర్ డీజిల్ రూ.353 నుంచి రూ.443కు, కిరోసిన్ రూ.195 నుంచి 30.8 శాతం మేర పెరిగి రూ.255కు, అదేవిధంగా, పెట్రోల్ 25.6 శాతం మేర పెరిగి రూ.398కి చేరుకుంది. ఇంధన ధరలు ఆకాశాన్నంటుతుండటంతో దేశం 2022నాటి ఆర్థిక సంక్షోభాన్ని మరోసారి చవిచూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. 1948లో స్వాతంత్ర్యం పొందాక మొట్ట మొదటిసారిగా శ్రీలంక అప్పులు చెల్లించలేని స్థితిలో సార్వభౌమ డిఫాల్టర్‌గా ప్రకటించారు. ఇంధన ధరలు పెరిగిన కారణంగా 90 శాతం మేర బస్సులను తిప్పే పరిస్థితులు లేవని ప్రైవేట్ బస్సు సంస్థల నిర్వాహకులు ప్రకటించారు. 'డీజిల్ ధరుల్లో గతంలో ఎన్నడూ ఇంతభారీగా పెరగులేదు. ఇందుకు తగ్గట్లుగా కనీసం 15 శాతుమైన ఛార్జీలను పెంచకుండా బస్సులను నడపలేం'అని ప్రైవేట్ బస్సు యజమానుల సంఘం అధ్యక్షుడు విజయరత్నే చెప్పారు. దేశంలోని బస్సు సర్వీసులను 65--75 శాతం మేర ప్రైవేట్ సంస్థలే నడుపుతున్నాయి. పెట్రోల్ ధర రూ.400 వరకు పెరిగితే ఆటోల్లో ఎవరు ప్రయాణిస్తారంటూ ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. పెంచిన ఇంధన ధరలతో పన్నుల రూపంలో ప్రభుత్వమే లాభపడుతోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

కాగా, ఇంధన ధరల పెరుగుదలతో దేశంలో ద్రవ్యోల్బణం 5--8 శాతం వరకు పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, లీటరు పెట్రోలుపై రూ.100, డీజిల్‌పై రూ.20 వరకు సబ్సిడీ ఇస్తున్నామని, దీనివల్ల ప్రభుత్వంపై నెలకు రూ.2 వేల కోట్ల మేర భారం పడుతోందని ప్రభుత్వం తెలిపింది. ఇంధన ధరలను పెంచకుంటే మరింత భారం మోయాల్సి ఉంటుందని పేర్కొంది. ప్రజలు విద్యుత్ శక్తితో అవసరాలు తీర్చుకోవాలని, ఇంధన వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించింది. ప్రభుత్వం ఇప్పటికే ఇంధన రేషనింగ్ అమలు చేస్తోంది. క్యూఆర్ కోడ్ సాయంతో వారానికి బైక్‌లకు 5 లీటర్లు, కార్లకు 15 లీటర్లు, బస్సులకైతే 60 లీటర్ల ఇంధనాన్ని

# నేడే రైతు భరోసా నిధులు

(మొదటి పేజీ తరువాయి)

భరోసా నిధులు అందనున్నాయి. తొలి విడతలో దాదాపు రూ. 3,600 కోట్ల మొత్తాన్ని 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లుగానే రైతు భరోసా నిధుల విడుదలను ప్రారంభించారు. ఆదివారం సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో ఆయిల్ పామ్ కర్మాగారాన్ని ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో వేదికపై నుంచే ల్యాప్ టాప్ లో మీట నొక్కి నిధులను విడుదల చేశారు. రాష్ట్రంలోని రైతులందరికీ సోమవారం నుంచి వారి ఖాతాల్లో చేరనున్నాయి. అయితే ఈసారి మొత్తం మూడు విడతల్లో రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇందులోనూ ఆసక్తికరమైన విధానాన్ని అనుసరించనున్నారు. దీని ప్రకారం.. తొలి విడతలో ఒక ఎకరం భూమికి రైతుభరోసా సాయం అందజేయనున్నారు. అంటే.. ఒక రైతుకు ఎన్ని ఎకరాలున్నా సరే తొలి విడతలో ఎకరానికి మాత్రమే సాయం అంధజేస్తారు. ఆ తరువాత రెండో విడతలో ఎన్ని ఎకరాలు అని



నిర్ధారిస్తే ఒక్కో రైతుకు అన్ని ఎకరాలకు పెట్టుబడి సాయం అందిస్తారు. కాగా, తొలి విడతలో ఆదివారం దాదాపు రూ. 3,600 కోట్ల మొత్తాన్ని 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రేపటిలోగా రైతుల ఖాతాలోనూ 'రైతు భరోసా' నిధులు జమ అవుతాయని చెప్పారు. మిగిలిన రూ. 5,400 కోట్లను మరో రెండు విడతలలో విడుదల చేయనున్నట్టు తెలిపారు. మరో 20 రోజులలో రూ. 2,700 కోట్లు, ఆ తర్వాత 20 రోజుల్లో మరో రూ. 2,700 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నట్టుగా చెప్పారు. మొత్తంగా 45 రోజులలో రాష్ట్రంలోని రైతుల ఖాతాల్లో రైతు భరోసా కింద రూ. 9 వేల కోట్లు జమ చేస్తామని తెలిపారు. రైతుల కళ్లలో ఆనందం చూడటమే తమ లక్ష్యమని చెప్పారు. రైతు భరోసా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ. 6 వేల చొప్పున రైతు ఖాతాల్లో జమ చేస్తుంది. మొత్తంగా మూడు విడతలలో రాష్ట్రంలోని 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి రూ. 9 వేల కోట్లు రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాల్లో జమ చేయనున్నట్టుగా తెలిపింది. ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేసిన తర్వాత... దరఖాస్తు సమయంలో రైతులు సమర్పించిన మొబైల్ నంబర్లకు మెసేజ్‌లు వస్తాయి. తద్వారా రైతులు తమ అకౌంట్లలో రైతు భరోసా నిధులు పడ్డాయో? లేదో? చెక్ చేసుకోవచ్చు. లేకపోతే బ్యాంక్ స్టేట్‌మెంట్ చెక్ చేసుకోవడం ద్వారా కూడా తమ అకౌంట్‌లలో నిధులు జమ అయ్యాయా? లేదా? అనేది తెలుసుకునే వీలు ఉంది.

# ఆ ఒక్క తప్పిదంతో మంత్రి పదవికి బుచ్చయ్య చౌదరి దూరం!

(మొదటి పేజీ తరువాయి)

చాలామంది ఆశావ హుల పేర్లు బయటపడు తున్నా యి. ఈ క్రమంలోనే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేరు కూడా వినిపిస్తోంది. ఆయన ఎనిమిది పదుల వయసుకు దగ్గరగా ఉన్నారు. టిడిపిలో సీనియర్ మోస్ట్ లీడర్ కూడా. దాదాపు ఏడుసార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. ఒక ఏడాది పాటు మాత్రమే మంత్రి అయ్యారు. మంచి వాగ్ధాటితోపాటు సబ్జెక్టు కలిగిన నేత. అయినా సరే ఆయనకు మంత్రిగా ఛాన్స్ దక్కలేదు. దానికి కారణం 1995 టీడీపీ సంక్షోభం అని ఎక్కువ మంది విశ్లేషిస్తారు. ఆ సమయంలో బుచ్చయ్య చౌదరి చంద్రబాబును తీవ్రంగా వ్యతిరేకించడం వల్లనే ఈరోజుకు ఆయనకు మంత్రి పదవి రాలేదని పొలిటికల్ వర్గాల్లో టాక్. ఆరోజు కానీ బుచ్చయ్య చౌదరి చంద్రబాబుకు అనుకూలమైన నిర్ణయం తీసుకొని ఉంటే.. యనమల రామకృష్ణుడు, అశోక్ గజపతిరాజు, అయ్యన్నపాత్రుడు, కేఈ కృష్ణమూర్తి మాదిరిగా.. బుచ్చయ్య చౌదరికి మంచి రాజకీయ అవకాశాలు దక్కి ఉండేవని పొలిటికల్ వర్గాల్లో ఒక చర్చ..

### 1995లో సంక్షోభం..

1995లో టిడిపిలో ఒక సంక్షోభం జరిగింది. నందమూరి తారక రామారావు నాయకత్వాన్ని సొంత కుటుంబ సభ్యులతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు విభేదించారు. లక్ష్మీపార్వతి రాజకీయ ప్రమేయాలను సహించుకోలేకపోయారు. ఈ క్రమంలో పార్టీ ఎమ్మెల్యేలు చంద్రబాబు నాయకత్వంలో తిరుగుబాటు చేశారు. కానీ ఆ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పార్టీ సీనియర్లు చంద్రబాబు వైపు వచ్చారు. కానీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, గాలి ముద్దుకృష్ణమనాయుడు వంటి నేతలు మాత్రం నందమూరి తారక రామారావు వెంట ఉండిపోయారు. అయితే ఎన్టీఆర్ మరణానంతరం వారు సైతం టిడిపిలోకి ప్రవేశించారు. అయితే బుచ్చయ్య చౌదరికి టిడిపిలో ప్రవేశం కల్పించారు కానీ గాలి



ముద్దుకృష్ణమనాయుడు కు ఆ ఛాన్స్ లేకపోవడంతో ఆయన కాంగ్రెస్ వైపు వెళ్లారు. తిరిగి టిడిపిలోకి వచ్చారు కానీ అకాల మృతి చెందారు.

### రాజకీయంగా శాపం

నాడు బుచ్చయ్య చౌదరి తీసుకున్న నిర్ణయమే ఆయనకు రాజకీయంగా శాపంగా మారిందన్న టాక్ వినిపిస్తోంది. ఆరోజు బుచ్చయ్య చౌదరి చంద్రబాబుకు అండగా నిలబడి ఉంటే ఎనలేని ప్రాధాన్యం దక్కి ఉండేది. ఎందుకంటే బుచ్చయ్య చౌదరి చంద్రబాబు సామాజిక వర్గమే. కానీ ఆయన అప్పుడు ఆలస్యం చేయడంతో ఆ స్థానాన్ని భర్తీ చేశారు దేవినేని ఉమామహేశ్వరరావు, ఇతరత్రా కమ్మ సామాజిక వర్గం నేతలు. నాడు ఆలస్యంగా టిడిపిలోకి వచ్చిన క్రమంలో మిగతా కమ్మ సామాజిక వర్గం నేతలు తమ ప్రాబల్యాన్ని పెంచుకున్నారు. అలా మంత్రి పదవికి దూరమయ్యారు బుచ్చయ్య చౌదరి. లేకుంటే మిగతా సీనియర్ నేతల మాదిరిగా ఎన్నెన్నో పదవులు దక్కేవి బుచ్చయ్య చౌదరికి. ఆ ఒకే ఒక్క మిస్టేక్ ఆయనకు శాపంగా మారింది. ఆయనకు పొలిటికల్ గా కలిసి రాలేదు ఆ నిర్ణయంతో.. అయితే ఈసారైనా తనకు మంత్రి పదవి దక్కుతుందని ఆశగా ఉన్నారు బుచ్చయ్య చౌదరి. మరి ఆయన ఆశలు తీరుతాయా? లేదా? అనేది చూడాలి.



# ప్రభుత్వాధినేతగా 8,931 రోజులు!

## చరిత్ర సృష్టించిన మోదీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చరిత్ర సృష్టించారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆదివారం మరో అరుదైన మైలురాయికి చేరుకున్నారు. స్వతంత్ర భారతదేశంలో అత్యధిక కాలం ప్రభుత్వాధినేతగా కొనసాగిన నాయకుడిగా రికార్డుకెక్కారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా నిరాటంకంగా 8,931 రోజులపాటు పదవిలో కొనసాగారు. ఈ విషయంలో సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్‌కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న రికార్డును మోదీ తిరగరాశారు. చామ్లింగ్ సీఎంగా 8,930 రోజులపాటు పదవిలో కొనసాగారు. ఆదివారంతో మోదీ 8,931 రోజుల పదవీ కాలాన్ని పూర్తిచేసుకున్నారు.

### కేంద్ర మంత్రుల అభినందనలు

ప్రభుత్వాధినేతగా 8,931 రోజుల పదవీ కాలాన్ని పూర్తిచేసుకున్న కేంద్ర మంత్రులు తదితరులు అభినందనలు తెలియజేశారు. "ప్రధాని గత 24 ఏళ్లకుపైగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా దేశం కోసం, ప్రజల కోసం పని చేస్తున్నారు. ఇది ఆయన అంకితభావానికి నిదర్శనం. 'మోదీ యుగం' దేశ రూపురేఖలనే మార్చివేసింది. ఈ 8,931 రోజుల ప్రస్థానం దేశం పట్ల ఆయన నిబద్ధత, ప్రతి పౌరుడి పట్ల ఆయన చూపే అసమాన సేవానిరతికి ప్రతీక" అని హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా, పీయూష్ గోయల్, అశ్వినీ వైష్ణవ్, కిరణ్ రిజిజు, బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ తదితరులు కూడా మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. దేశంపట్ల, ప్రజల పట్ల ఉన్న అచంచలమైన అంకితభావం కలిగిన గొప్ప నాయకుడు అంటూ కొనియాడారు. "మోదీ జీవితమంతా నిరంతర సేవా ప్రయాణం.

# గ్రేటర్‌పై కమలం కన్ను!

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ మొత్తాన్ని ఆవహించాలని గట్టి ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం.

### మొన్న తిరువనంతపురంలో..

కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురం. ఇటీవల ఆ నగరంలో సత్తా చాటింది భారతీయ జనతా పార్టీ. కనీసం కేరళలో బిజెపికి ప్రాతినిధ్యం లేదు. అక్కడ పార్టీ ఉనికి చాటుకునేందుకు ఇబ్బంది పడుతుంది. కానీ ఆ రాష్ట్రంలో బాగా వేయాలంటే రాజధాని లో ప్రతాపం చూపాలని చూసింది. అలా తిరువనంతపురం నగరాన్ని కైవసం చేసుకుంది కమలం పార్టీ. ఇప్పుడు అదే వ్యూహంతో ముందుకు సాగుతోంది. గ్రేటర్ హైదరాబాద్ ను కైవసం చేసుకోవాలని చూస్తోంది. అయితే గ్రేటర్ హైదరాబాద్ 400 డివిజన్లతో విస్తరించి ఉంది. దీనిని 3 నగరాలుగా విభజించింది కాంగ్రెస్ ప్రభుత్వం. అయితే ఈ 400 డివిజన్లకు గాను 300 డివిజన్లను వచ్చే ఎన్నికల్లో గెలుపొందాలని బిజెపి గట్టి ప్రణాళిక వేసుకుంది. అందుకే ప్రధాని నరేంద్ర మోడీ వచ్చే నెలలో గ్రేటర్ లో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

### పెరిగిన బలం

గ్రేటర్ పరిధిలో భారతీయ జనతా పార్టీ గట్టిగానే ఉంది. గడిచిన బల్దియా ఎన్నికల్లో 40 డివిజన్లను ఆ పార్టీ గెలుచుకుంది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఎనిమిది ఎంపీ సీట్లను కైవసం చేసుకుంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అయితే 8 సీట్లు సొంతం చేసుకుంది. అయితే ఈసారి గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటడం ద్వారా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కావాలని భావిస్తోంది. 2028 అసెంబ్లీ ఎన్నికలకు ఒక ఊపు తేవాలంటే బల్దియా ఎన్నికల్లో బలమైన మార్గం ఏర్పాటు చేసుకోవాలని చూస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ పరిధిలో బలహీనంగా ఉండేది. కానీ ఇటీవల ఉప ఎన్నికల్లో వరుసగా విజయాలు సొంతం చేసుకుంటూ తన సత్తా చాటుతోంది. ఇంకోవైపు గులాబీ పార్టీ ఇంకా చిక్కుల్లోనే ఉంది. రోజురోజుకు ఆ పార్టీ బలహీనం అవుతోంది. గులాబీ పార్టీ నేతలను ఆకర్షించే పనిలో పడింది భారతీయ జనతా పార్టీ. ఎట్టి పరిస్థితుల్లో వచ్చే బల్దియా ఎన్నికల్లో ఎక్కువ స్థానాలను కైవసం చేసుకోవాలని చూస్తోంది.

### నేరుగా రంగంలోకి ప్రధాని..

మొన్న ఆ మధ్యన ప్రధాని నరేంద్ర మోడీ బిజెపి ఎంపీలను పిలిచి తెలంగాణలో పార్టీ పరిస్థితి గురించి తెలుసుకున్న సంగతి తెలిసిందే. అందరూ కలిసికట్టుగా ఉండి పార్టీని మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్లాలని కోరినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు నేరుగా ప్రధాని రంగంలో దిగబోతున్నారు. తెలంగాణను బిజెపి ఏ స్థాయిలో ప్రాధాన్యం ఇస్తుందో ఇట్టే అర్థమవుతుంది. మరి బిజెపి ఎలాంటి విజయాలను నమోదు చేస్తుందో చూడాలి.

# జీవన్ రెడ్డి వ్యూహం ఏంటి?



(మొదటి పేజీ తరువాయి)

ఇలాంటి ప్రమాదమే ఉన్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తప్పకుండా జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి దెబ్బతీస్తారన్న వారు ఎక్కువ.

**గులాబీని దెబ్బ కొట్టిన పొంగులేటి..**

గతంలో ఖమ్మం జిల్లాలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని చాలా తక్కువ చేసి చూసింది గులాబీ పార్టీ. ఆయనపై నేతలు రాంగ్ ఫీడ్ బ్యాక్ ఇవ్వడంతో బిఆర్ఎస్ నాయకత్వం తక్కువగా అంచనా వేసింది. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయాక ఒక్కో నేత ఆయనను అనుసరించారు. పొంగులేటి వెళ్ళిపోయిన వెంటనే తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు వంటి నేతలు కూడా అనుసరించారు. ఇప్పుడు జీవన్ రెడ్డి వెళ్లిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి ఓ భారీ టీం ఎన్నికలకు ముందు వెళ్లడం ఖాయమని తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో చర్చ నడుస్తోంది. ప్రస్తుతానికైతే ఉమ్మడి కరీంనగర్ జిల్లా పై జీవన్ రెడ్డి ప్రభావం ఉంటుంది. కానీ 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు చాలామంది నేతలు పార్టీ నుంచి బయటపడతారని కాంగ్రెస్లో కూడా ఒక వాదన ఉంది.

**జవసత్వాలు నింపిన జీవన్ రెడ్డి..**

ఒక్క మాటలో చెప్పాలంటే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి జవసత్వాలు నింపడంలో జీవన్ రెడ్డి పాత్ర కూడా ఉంది. 2014 ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గులాబీ పార్టీ హవా ఉండేది. 2018 ఎన్నికల్లో అయితే వారు వన్ సైడ్ అన్నట్టు గులాబీ పార్టీ వైపు లీడ్ కనిపించింది. ఆ సమయంలో ఆ జిల్లా నుంచి కేవలం జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారు అంటే ఆయన ఎంతటి బలవంతుడో అర్థం అవుతుంది. 2023 ఎన్నికలకు ముందు కరీంనగర్ తో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో కాంగ్రెస్ ఆచూకీ లేదు. అటువంటి సమయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీకి ఊపిరి పోసింది జీవన్ రెడ్డి. అటువంటి జీవన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు లైట్ తీసుకుంటుంది. కానీ ఆయన భవిష్యత్తులో పెద్ద దెబ్బ కొట్టబోతున్నారు. దానికి తప్పకుండా కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించుకుంటుందని టాక్ ఉంది పొలిటికల్ వర్గాల్లో.

**ప్రభావం ఎక్కువే..**

అయితే ఏ పార్టీ నుంచి అయినా ఒక నేత బయటకు వెళ్ళినప్పుడు ఆ పార్టీకి డ్యామేజ్ జరగడం జరుగుతూ ఉంటుంది. అది సాధారణమైన చర్య కూడా. కానీ జీవన్ రెడ్డి దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీతో ఉన్న సంబంధాలను తెంచుకొని వెళ్తున్నారు అంటే.. ఆయన పక్క వ్యూహంతోనే ఉన్నట్టు అర్థమవుతుంది. అయితే సరైన సమయం చూసి ఆయన సైతం దెబ్బ కొడతారని అనుచర వర్గం చెబుతోంది. కానీ కాంగ్రెస్ మాత్రం చాలా లైట్ తీసుకుంటుంది జీవన్ రెడ్డిని. పొంగులేటి మాదిరిగానే జీవన్ రెడ్డి సైతం కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయడం ఖాయమని పొలిటికల్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరి మున్ముందు జీవన్ రెడ్డి ఎలా రివెంజ్ తీసుకుంటారో చూడాలి.

# తీవ్ర అసంతృప్తితో ముద్రగడ!

కూడా అలానే ఉన్నాయి. ముద్రగడ పద్మనాభం వైసీపీలో తనకు ప్రాధాన్యం కోరుకుంటున్నారు. ఒక పదవి ఇవ్వాలని జగన్ వద్ద ప్రతిపాదన పెట్టారు. కానీ అందుకు జగన్ అంగీకరించలేదని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది..

**ఎన్నికలకు ముందు వైసీపీలోకి..**

మొన్నటి ఎన్నికలకు ముందు కుమారుడితో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు ముద్రగడ పద్మనాభం. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని కూడా శపథం చేశారు. అక్కడ ఓడించలేక తన పేరును మార్చుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఓ నియోజకవర్గ ఇన్చార్జిగా ముద్రగడ కుమారుడు ఉన్నారు. ముద్రగడ పద్మనాభం సైతం తెరవెనుక వ్యూహాలు రూపొందిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి ముద్రగడను వైసిపి పొలిటికల్ అడ్వైజరీ కమిటీలోకి తీసుకున్నారు. కానీ ఆ పదవికి ఎటువంటి బాధ్యతలు లేవు. అందుకే బాధ్యతయుతంగా ఉండే గోదావరి జిల్లాల బాధ్యతలను తనకు ఇవ్వాలని ముద్రగడ జగన్మోహన్ రెడ్డి ముందు ప్రతిపాదన పెట్టినట్లు తెలుస్తోంది. అయితే ముద్రగడ పరిస్థితి జగన్ మోహన్ రెడ్డికి తెలుసు. ఆయన ఎప్పుడూ పాతతరం రాజకీయాలనే చేస్తుంటారని జగన్ గుర్తించారు. అందుకే గోదావరి జిల్లాల బాధ్యతలు ఇచ్చేందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది. అప్పటినుంచి ముద్రగడ కోపంతో రగిలిపోతున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం అయితే మాత్రం జరుగుతోంది.

**సీనియర్ మోస్ట్ లీడర్..**

1978లో రాజకీయాల్లోకి వచ్చారు ముద్రగడ. ఆ ఎన్నికల్లో పోటీ చేసి గెలవడం ద్వారా అసెంబ్లీలో అడుగు పెట్టారు. అదే సమయంలో చంద్రబాబుతో పాటు రాజశేఖర్ రెడ్డి సైతం ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఆ ఇద్దరు నేతలతో ముద్రగడ పనిచేశారు. కానీ ముద్రగడకు స్థిరత్వం తక్కువ. తరచూ పార్టీలు మారుతారు. నేతలతో విభేదిస్తుంటారు. ప్రస్తుతం వైసీపీలో ఉన్న చాలామంది నేతలతో ముద్రగడకు పడడం లేదట. అటువంటి నేతకు గోదావరి జిల్లాల బాధ్యతలు ఇస్తే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని జగన్మోహన్ రెడ్డి గుర్తించారట. అందుకే గోదావరి జిల్లాల బాధ్యతలు ఇవ్వడం కుదరదు అని తేల్చేసారట. అప్పటినుంచి ముద్రగడ జగన్మోహన్ రెడ్డి తీరుపై ఆగ్రహంగా ఉన్నారట. ఇప్పటికే వయోభారంతో బాధపడుతున్నారు ముద్రగడ. ఈ సమయంలో ఆయనకు పెద్ద పదవులు ఎందుకన్న ప్రశ్న వస్తుంది. ఆయనకు ఎటువంటి బాధ్యతలు ఇవ్వద్దని కొంతమంది వైసీపీ కాపు నేతలు జగన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారట. ఈ పరిస్థితులు చూస్తుంటే ముద్రగడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉంటారా? ఉండరా? అనే బలమైన చర్చ మాత్రం నడుస్తోంది.

# అరాద్, డిమోనా నగరాలపై ఇరాన్ దాడులు



(మొదటి పేజీ తరువాయి)

దద్దరిల్లిపోతున్నాయి. యుద్ధం ఆదివారం 23వ రోజుకు చేరుకుంది. నతాంజ్ అణు కేంద్రంపై దాడులకు ప్రతీకారంగా ఇరాన్ సైన్యం హెజ్‌బోల్లా మిలిటెంట్లతో కలిసి ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. నెగెవ్ ఎడారిలోని ఇజ్రాయెల్ ప్రధాన అణు పరిశోధన కేంద్రమే లక్ష్యంగా దాడులకు దిగింది. దాని సమీపంలోని అరాద్, డిమోనా పట్టణాలపై బాంబుల వర్షం కురిపించింది. వందల కిలోల వార్‌హెడ్లతో కూడిన బాలిస్టిక్ క్షిపణులను కూడా ప్రయోగించింది. ఈ ఘటనలో కనీసం 180 మందికిపైగా గాయపడినట్లు సమాచారం. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ దాడిలో పలు భవనాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్ క్షిపణులను అడ్డుకోవడంలో అత్యాధునిక ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థ ఘోరంగా విఫలం కావడం గమనార్హం. ఇరాన్ దాడిలో ఎవరూ మరణించకపోవడం నిజంగా అద్భుతమేనని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అన్నారు. అరాద్‌లో ఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ యుద్ధంలో అనుకున్న లక్ష్యం కచ్చితంగా సాధిస్తామని తేల్చిచెప్పారు. అంతర్జాతీయ సమాజం తమకు సహకరించాలని కోరారు. తద్వారా యుద్ధం మరింత తీవ్రతరం కావడం తథ్యమని సంకేతాలిచ్చారు. ఇరాన్ బాలిస్టిక్ మిస్సైళ్లు తమ డిఫెన్స్ వ్యవస్థలను ఛేదించుకుని ఎలా రాగలిగాయన్న దానిపై ఇజ్రాయెల్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం ఉత్తర ఇజ్రాయెల్‌లో వైమానిక దాడిలో ఒకరు మృతిచెందారు. ఈ దాడికి పాల్పడింది తామేనని లెబనాన్ హెజ్‌బొల్లా మిలిటెంట్లు ప్రకటించారు. ఆదివారం ఉదయం ఇజ్రాయెల్‌లో సైరన్ల మోతలు వినిపించాయి.

**టెల్ అవీవ్‌పై క్షిపణి దాడులు**

సౌదీ అరేబియా, యూఏఈ సహా ఇతర గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. ఇరాన్ ఆయుధాలను మధ్యలోనే కూల్చివేశామని ఆయా దేశాలు వెల్లడించాయి. ఇరాన్‌లోని అండిమెష్క్ సిటీ ఆసుపత్రిపై భారీ దాడి జరిగింది. రోగులు, వైద్యులను మరో నగరానికి తరలించారు. ఈ దాడికి ఇజ్రాయెల్ కారణమని భావిస్తున్నారు. హెజ్‌బోల్లా మిలిటెంట్లు తమ ఆయుధాలను ఇజ్రాయెల్ సరిహద్దుకు తరలిస్తున్నారు. లెబనాన్‌లోని ఖస్మియే వంతెనను ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. ఉత్తర సరిహద్దుకు సమీపంలోని లెబనాన్ నివాసాలను ధ్వంసం చేయాలని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ తమ సైన్యాన్ని ఆదేశించారు. ఇజ్రాయెల్ దాడుల్లో లెబనాన్‌కు ఇప్పటికే వెయ్యి మందికిపైగా మృతిచెందారు. 10 లక్షల మంది సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. హెజ్‌బోల్లా గ్రూప్ వందలాది రాకెట్లను ఇజ్రాయెల్‌పై ప్రయోగించింది. ఇజ్రాయెల్‌లో కీలక నగరం టెల్ అవీవ్‌పై ఇరాన్ ఆదివారం బాలిస్టిక్ క్షిపణితో దాడికి దిగింది. ఈ దాడిలో పలువురు గాయపడినట్లు తెలిసింది. హార్మూజ్ నుంచి రాకపోకలు సాగించేందుకు కొన్ని దేశాల నౌకలకు తాజాగా అనుమతి లభించింది. ఇందులో భారత్, జపాన్, చైనా, పాకిస్తాన్, తుర్కియే చమురు నౌకలు ఉన్నాయి.

**ప్రపంచానికి పెనుముప్పు ఇరాన్: నెతన్యాహు**

ఇరాన్ వద్ద అత్యంత ప్రమాదకరమైన మారణాయుధాలు ఉన్నాయని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆదివారం ఆరోపించారు. డీగో గార్సియా దీవిపై జరిగిన దాడిని ప్రస్తావించారు. సుదూరంలో ఉన్న యూరప్ దేశాలపైనా దాడి చేసే సామర్థ్యం ఇరాన్‌కు ఉన్నట్లు దీన్నిబట్టి తెలుస్తోందని అన్నారు. ప్రపంచానికి ఇరాన్ పెనుముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజలందరి బాగు కోసమే అమెరికాతో కలిసి తాము పోరాడుతున్నామని తేల్చిచెప్పారు. శనివారం రాత్రి రెండు పట్టణాలపై దాడులకు దిగడం అత్యంత దారుణమని మండిపడ్డారు. సాధారణ జనావాసాలను ఇరాన్ టార్గెట్ చేసిందన్నారు. ప్రజలను హత్య చేయాలన్నదే ఇరాన్ అసలు ఉద్దేశమని విమర్శించారు. అదృష్టవశాత్తూ ఈ దాడుల్లో ఎవరూ చనిపోలేదని వ్యాఖ్యానించారు.

**హార్మూజ్‌ను తెరవకుంటే వినాశనమే: ట్రంప్**

హార్మూజ్ నుంచి నౌకల రాకపోలకు అడ్డంకులు సృష్టిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించారు. జలసంధిని 48 గంటల్లోగా పూర్తిగా తెరవాలని తేల్చిచెప్పారు. తమ మాట వినకపోతే ఇరాన్‌కు తగిన బుద్ధి చెప్తామని అన్నారు. ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలను, ఇతర సదుపాయాలను సర్వనాశనం చేస్తామని తేల్చిచెప్పారు. ట్రంప్ హెచ్చరికపై ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్ మొహమ్మద్ బాఘేర్ గలిబాఫ్ తీవ్రంగా స్పందించారు. తమ జోలికి రావొద్దని సూచించారు. తమ విద్యుత్ ప్లాంట్లు, మౌలిక సదుపాయాలపై దాడి చేస్తే హార్మూజ్‌ను పూర్తిగా మూసివేస్తామని తేల్చి చెప్పారు.

# అవగాహనలేమితో తెలంగాణ పరువు తీస్తున్నాడు



ంవంత్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. 'నల్లమల సరిహద్దులు, కృష్ణా--గోదావరి జలాలు, సుంకేశుల ప్రాజెక్టుల మీదే కాదు..కళ్ల ముందున్న సంస్థలపై కూడా సీఎంకు కనీస అవగాహన లేదు. ప్రాథమిక అవగాహన లేకుండా సీఎం తెలంగాణ పరువు తీస్తున్నాడు. ఇక్రిశాట్ ఏ ఒక్క దేశానికీ చెందినది కాదు..ఇది సీజీఐఏఆర్ వ్యవస్థలో భాగమైన స్వతంత్ర అంతర్జాతీయ పరిశోధనా సంస్థ'అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. దీని ఏర్పాటులో ఎఫ్ఏఓ, యూఎన్డీపీ, వరల్డ్ బ్యాంక్ కీలక పాత్ర పోషించాయని, ప్రారంభంలో ఫోర్డ్, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్లతోపాటు భారత ప్రభుత్వం, పలు దేశాల మద్దతుతో నడుస్తున్న గ్లోబల్ వేదిక అని వివరించారు. 'దాన్ని అమెరికా రీసెర్చ్ సెంటర్ అనడం దారుణం. ఇంత ప్రాథమిక విషయాలు కూడా తెలియని స్థితిలో రాష్ట్రాన్ని నడిపిస్తున్నారు. దీంతో తెలంగాణ ప్రయోజనాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి'అని హరీశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రతి వ్యాఖ్య బాధ్యతాయుతంగా, వాస్తవాల ఆధారంగా ఉండాలని సూచించారు. ఇప్పటికైనా నోటికి వచ్చినట్టు మాట్లాడటం మానుకొని, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడండి అని హితవు పలికారు.

# బంజారాహిల్స్‌లో బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ హల్ చల్..

ఏపీలోని అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ హైదరాబాద్‌లో కలకలం సృష్టించారు. నగరంలోని బంజారాహిల్స్‌లో ఉన్న ఓ వివాదాస్పద స్థలం వద్ద ఆయన హంగామా చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ వెనుక ఉన్న ఆనంద్ ప్రభాత్ సొసైటీ స్థలంపై కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఆదివారం ఉదయం సీఎం రమేశ్ తన అనుచరులతో కలిసి ఈ స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఉన్నవారిని ఉద్దేశిస్తూ, "వీడియో తీయ్" అంటూ తన సిబ్బందిని ఆదేశిస్తున్న దృశ్యాలు బయటకు వచ్చిన వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆయన రాకతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ వివాదం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ వరకు చేరినట్లు సమాచారం. అయితే, సీఎం రమేశ్ ఆ స్థలానికి ఎందుకు వెళ్లారు? ఈ ఘటనపై ఎవరైనా ఫిర్యాదు చేశారా? అనే పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
4 సోమవారం 23-3-2026

# భగత్ సింగ్‌కు “సిపిఎం” ఘన నివాళి






## పటాన్ చెరు శ్రామిక్ భవన్ నుంచి సిపిఎం భారీ బైక్ ర్యాలీ

## జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన చుక్క రాములు

## స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ త్యాగం మరువ లేనిది

## బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడు భగత్ సింగ్

## “ఇంక్విలాబ్ జిందాబాద్” అంటూ ప్రతిధ్వనించిన నినాదాలు

## కుల, మత రాజకీయాలపై విమర్శలు చేసిన చుక్క రాములు

## అంతర్జాతీయ యుద్ధాలపై ఆందోళన చెందిన సిపిఎం

## ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపు

పటాన్ చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మార్చి 22: భగత్ సింగ్ ఆశించిన ఆశయాలకనుగుణంగా అందరు పనిచేయాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు పిలుపునిచ్చారు. ఆదివారం భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పటాన్ చెరు శాంతినగర్ శ్రామిక్ భవన్ నుండి సారాయి మీదుగా ఎంజీ రోడ్ అంబేద్కర్ విగ్రహం నేషనల్ హైవే మీదుగా ఆర్ సి పురం బీరంగూడ, గుట్టకమాన్ భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. చుక్కా రాములు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ... భగత్ సింగ్ తన 23 సంవత్సరాల కాలంలోనే దేశ స్వాతంత్రం కోసం పోరాడినాడని గుర్తు చేశారు. 1907 సంవత్సరంలో జన్మించి, 1931 మార్చి 23వ తేదీన ఉరి తీయబడ్డాడని అన్నారు. అప్పట్లో మన దేశానికి వ్యాపారం చేసుకోవడానికి బ్రిటిష్ వాడు వచ్చి, మన దేశాన్ని పరిపాలిస్తున్న క్రమంలో తన చిన్నతనంలోనే బ్రిటిష్ వాడు చేస్తున్న పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడినాడని గుర్తు చేశారు. ప్రజా భద్రత చట్టం, పారిశ్రామిక వ్యవహారాల చట్టాలు రెండు ఆనాడు ప్రజా ఉద్యమాలను అణిచివేయడానికి వచ్చాయని అన్నారు. వాటికి నిరసనగా భగత్ సింగ్ పార్లమెంటులో పొగబాంబు విసిరాడని అన్నారు. పొగ బాంబు వేసాక తమ భావాలను ప్రజానీకానికి చెప్పడం కోసం, ఇంక్విలాబ్ జిందాబాద్ అన్న నినాదంతో దొరికిపోయాడని అన్నారు. పార్లమెంటులో భారత ప్రజానీకం ఎవరు కూడా ప్రాణ నష్టం జరగకూడదని ఉద్దేశంతోనే పొగ బాంబులు విసిరాడని గుర్తు చేశారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుకుదేవ్ ఆనాడు దేశ స్వాతంత్రం కోసం పోరాడినారని గుర్తు చేశారు. దేశ స్వాతంత్ర పోరాటం జరుగుతున్న కాలంలో బ్రిటిష్ వారు అప్పటికే హిందువులు, మైనార్టీల పేరుతో ప్రజలను విచ్ఛిన్నం చేసే చర్యలకు బ్రిటిష్ ప్రభుత్వం ఆనాడు పాల్పడిందని గుర్తు చేశారు. భగత్ సింగ్ వీటిని వ్యతిరేకించాడని అన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మతాల, కులాల మధ్యన చిచ్చు పెడుతూ తమ పబ్బాన్ని గడుపు కొంటున్నారని అన్నారు. ఇప్పటికే ప్రపంచంలో అమెరికా ఇజ్రాయిల్ కలిసి ఇరాన్ మీద పెద్ద ఎత్తున యుద్ధం జరుగుతుందని అన్నారు. యుద్ధం విషయంలో మన దేశ ప్రధానమంత్రి ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఈ యుద్ధంలో దాదాపు వేల మందికి పైగా సామాన్య ప్రజానీకం చనిపోయారని అంటే యుద్ధం యొక్క తీవ్రత ఎలా ఉందో ప్రజానీకం మేధావి వర్గం గుర్తించాలని అన్నారు. ఇరాన్ ఇజ్రాయిల్ కలిసి ఇరాన్ లో స్కూల్స్ పైన బాంబులు విసరడంతో దాదాపు 1,000 మందికిపైగా విద్యార్థులు చనిపోయారని అంటే యుద్ధాన్ని, తీవ్రంగా ఖండించవలసిన అవసరం ఉందని అన్నారు, ఆదాని, అంబానీల కోసమే మన దేశ ప్రధానమంత్రి పని చేస్తున్నారని అన్నారు. యుద్ధము జరుగుతున్న క్రమంలో యుద్ధనౌకలు విన్యాసాలు జరుగుతుంటే విశాఖపట్నం యుద్ధనౌకను మన దేశ సైనికులు కాపాడకుండా, శ్రీలంక యుద్ధనౌకను కాపాడి 100 మందిని రక్షించిందంటే, మన దేశం యొక్క విదేశాంగ విధానం ఎలా ఉందో దీనిని బట్టి మనకర్థమవుతుందని అన్నారు. మన దేశ విదేశాంగ విధానంలో అమెరికా తలదూర్చబడడం ఏంటని ప్రశ్నించారు. మన దేశానికి గతంలో ఇరాన్ నుంచి పెట్రోలు డీజిల్ గ్యాస్ సరఫరా అయ్యేదని, ప్రస్తుతం అమెరికా ఏది చెప్తే ట్రంప్ కనుసన్నల్లోనే మన దేశ ప్రధానమంత్రి నడుస్తున్నాడని అన్నారు. ఆనాడు భగత్ సింగ్ కూడా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడినాడని అన్నారు. అందుకోసం భగత్ సింగ్ ఆశించిన ఆశయాలు కనుగుణంగా పోరాడాలని ప్రజానీకానికి పిలుపునిచ్చారు. అందుకోసం ఎర్రజెండా నాయకత్వంలో ప్రజా ఉద్యమాలను మరింత చుక్క రాములు గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.రాజయ్య ఎ.మాణిక్యం, సిపిఎం పార్టీ పటాన్ చెరు డివిజన్ కమిటీ కార్యదర్శి బి. నాగేశ్వరరావు, ఎండి వాజిద్ అలీ, పి. పాండురంగారెడ్డి, బి.పెంటయ్య, జి. జార్జ్, బి. అర్జున్, సత్తిబాబు, ఎస్. సురేష్ కుమార్, జె. పోచయ్య, జయరాం, కరెంట్ రాములు, యాక రామచంద్రమూర్తి, సురేష్, కోనయ్య, వెంకటరామిరెడ్డి, నరసింహారెడ్డి, గంగాధర్ పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.



# చిన్నారి జన్మదిన వేడుకల ప్రత్యేక పూజలు

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలోని రత్న కవిత అశోక్ రెడ్డి కుమార్తె చిన్నారి అద్విక రెడ్డి జన్మదిన వేడుకలు సూరారం హనుమాన్ మాలాధారణ భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకల సందర్భంగా గ్రామంలోని హనుమాన్ భక్తులు చిన్నారి పేరుతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి ఆశీస్సులు అందజేశారు.

# ముందస్తు అడిష్మన్లు ఇస్తే చర్యలు తీసుకోవాలి

### బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు



క్రైమ్ మిర్రర్ ఖమ్మం ప్రతినిధి నేలకొండపల్లి మార్చి 22: 2026-27 విద్యా సంవత్సరం కోసం జిల్లాలో ముందస్తుగా అడ్మిషన్లు ఇస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీ.ఎస్.పి నేలకొండపల్లి మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు డిమాండ్ చేశారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ఇంకా పూర్తి కాకముందే జిల్లాలో కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్నాయని అన్నారు. ఇకపై అడ్మిషన్లు చేపడుతున్నారని తమ దృష్టికి వస్తే జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విద్యాశాఖ అధికారి కి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

# బీసీ జన జాగరణ జాతరను విజయవంతం చేయాలి..

### మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు

**సంస్థాన్ నారాయణపురం, మార్చి 22(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు(మాస్) కటకం నర్సింగ్ రావు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఏప్రిల్ 19వ తేదీన నిర్వహించే బీసీ జన జాగరణ జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అగ్రవర్గాలకు వ్యతిరేకం కాదు... బీసీల ఐక్యత ఆత్మగౌరవం కోసం పోరాటాలు చేస్తున్నామని అన్నారు. పార్టీ సిద్ధాంతాలతో పని లేకుండా ఆర్ఎస్ఎస్ నుంచి రాడికల్ భావజాలమున్న బీసీలందరూ కుల రక్షణకు ఒక్కటి కావాల్సిందేనని అన్నారు. ఏ పార్టీకి అనుబంధంగా ఏ వ్యక్తులకు అనుకూలంగా ఉండబోమని స్పష్టం చేశారు. ఆలోచనకు అనుగుణంగా ముందుకు కేవలం మన ఆలోచన అనుగుణంగానే ముందుకు సాగుతుంది మాస్ అని అన్నారు. బీసీలలో వెనకబడిన వర్గాలు ముందుకు వచ్చి మాస్ ఆలోచన అందిపుచ్చుకోవాలని ఉన్నారు. బీసీలకు అత్యంత గౌరవమైన కుల వృత్తులను ప్రదర్శించి ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. ఆట,పాట, మాటతోనే ఈ కార్యక్రమం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రెటరీ గోద మల్లికార్జున్ గౌడ్,మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉప్పల వెంకటేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సికిలమెట్ల ప్రభాకర్, నరేందర్, విడం సాయి కిషోర్ నేత తదితరులు పాల్గొన్నారు.



# గ్యాస్ ధరలు తగ్గించాలి

### అమెరికా యుద్ధోన్మాదానికి స్వస్తి చెప్పాలి

### సీపీఐ(ఎం) మాజీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనూరు నర్సిరెడ్డి



**సశీస్థాన్ నారాయణపురం, మార్చి 22(క్రైమ్ మిర్రర్):** యుద్ధోన్మాదం తో అమెరికా,ఇజ్రాయిల్ ఇరాన్ పై చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని,పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ కార్యదర్శి వర్గ సభ్యులు దోనూరు నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని అల్లందేవిచెరువు గ్రామంలో ఆ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్,ఇజ్రాయిల్ అధ్యక్షుడు బెంజిమన్ నేతనుహు ప్రపంచ రౌడీ ల లాగ ఇరాన్ పై దుర్మార్గంగా యుద్ధం చేస్తున్నారన్నారు.ఇరాన్ పై జరుపుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపివేయాలని డిమాండ్ చేశారు.ఇరాన్ అధ్యక్షుడు ఖమేని ని చంపినా మోడీ ఖండించలేని ధ్వర్భాగ్య స్థితిలో ఉన్నారన్నారు. యుద్ధాల వల్ల పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలు పెంచడం వల్ల దేశ ప్రజలు ఆర్థిక నష్టాలకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా చిరు వ్యాపారస్తులు ఉపాధి కోల్పోతున్నారన్నారు.పెంచిన ధరలను వెంటనే తగ్గించాలన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వర్గ సభ్యులు జనగల నర్సింహా,గ్రామ శాఖ కార్యదర్శి గంగాదేవి బిక్షపతి, గుండులింగాస్వామి,జనిగల పద్మ, ఉప్పల పెల్లి బాలు, గుండు నర్సింహా, బి. నర్సిరెడ్డి,వెంకటేష్, ప్రభాకర్,గుండు జంగయ్య, రామాంజయ్య, గంగాదేవి పుష్పమ్మ, బి. పుష్పమ్మ, దశరత, జె.విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేసిన సర్పంచ్ కాటం వెంకటేశం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం పెద్ద కాపర్తి గ్రామంలోని తోటకూరి ఎల్లయ్య అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,వారి కుటుంబాన్ని ఓదారుస్తూ, వారికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇస్తూ 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించిన గ్రామ సర్పంచ్ కాటం వెంకన్న గతంలో కూడా ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ చేయించినారు, వారి వెంట గ్రామ ఉపసర్పంచ్ ఓర్సు సైదులు మాజీ ఉపసర్పంచ్ ఏర్పుల నరసింహ వార్డ్ మెంబర్లు సాగర్ల నాగరాజు, ఆనగంటి నరేష్, కురు యాదయ్య ఏర్పుల వెంకన్న ఉన్నారు.



# ఎస్ ఆర్ అండ్ బి జి ఎన్ ఆర్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** ఖమ్మం ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో గల కెరీర్ గైడెన్స్ ప్లేస్ మెంట్ సెల్ -టీ.ఎస్.కే.సి సంయుక్త ఆధ్వర్యంలో మ్యాజిక్ బస్ఇండియా ఫౌండేషన్ సహకారంతో ఈ నెల 24 మంగళవారం నాడు మెగా జాబ్ మేళా ను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబ్ మేళాలో ఫోన్ పే,కాప్ స్టన్, అపోలో ఫార్మసీ, హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్ ,టీమ్ లిజ్.కాం, శ్రీరాం ఫైనాన్స్,తదితర కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్నాయని తెలిపారు.2019-2025 మధ్యకాలంలో ఏదైనా డిగ్రీ పాసైన వారు, ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొనడానికి అర్హులని వెల్లడించారు.విద్యార్థులు పదవతరగతి,ఇంటర్, డిగ్రీ,మెమోలు,ఆధార్ కార్డులతో ఒక సెట్ జిరాక్సులు,ఒక పాస్ పోర్ట్ ఫోటో, ఎనిమిది సెట్ల రెజ్యూమేలను నిర్వాహకులకు అందజేయాలని సూచించారు.ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇతర వివరాలకు 9441939579,9618896949 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# బస్వాపురం ప్రాజెక్టును పూర్తి చేయడంలో, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు ఇంత కక్ష ...?

### ఈ బడ్జెట్ లో ఒక్క రూపాయి కూడా కేటాయించ కుండ వివక్షత చూపిన రేవంత రెడ్డి ప్రభుత్వం

### ఇప్పటికైనా 500 కోట్ల రూపాయలు కేటాయించి ప్రాజెక్టును పూర్తి చేయాలి

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ

**భువనగిరి, మార్చి 22(క్రైమ్ మిర్రర్):** బస్వాపురం ప్రాజెక్టును పూర్తి చేయడంలో, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు ఇంత కక్ష ఉన్నదని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ బడ్జెట్ లో ప్రాజెక్టు కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించకుండ వివక్షత చూపిందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ విమర్శించినారు. ఇప్పటికైనా ప్రాజెక్టు పూర్తి కోసం, నిర్వాసితుల నష్టపరిహారం కోసం తక్షణం 500 కోట్ల రూపాయలు కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు.ఆదివారం భువనగిరి మండల పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో సిపిఎం ఇంటింటి సమస్యల అధ్యయనంలో భాగంగా గ్రామంలోని గ్రామ సర్పంచ్ రాంపల్లి కృష్ణ, ఉప సర్పంచ్ అందే మల్లేశం, మాజీ సర్పంచ్ మాకొల్ల సత్యంకు కరపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ యాదాద్రి జిల్లాలో అత్యంత కీలకమైన బస్వాపురం ప్రాజెక్టు సుమారుగా 10 మండలాల్లోని లక్ష ఎనబై వేల (1.80) ఎకరాలకు పైగా సాగు భూమికి నీరు అందించేందుకు ఉపయోగపడే బస్వాపురం ప్రాజెక్టు కేవలం 500 కోట్ల రూపాయలు కేటాయిస్తే పూర్తయితుందని తెలిపారు. కానీ కాంగ్రెస్ రెండు సంవత్సరాల పాలనలో ఒక్క రూపాయి కూడా ప్రాజెక్టుకు విడుదల చేయలేదని విమర్శించారు. ప్రాజెక్టులో ఉన్న ఆ కొన్ని నీళ్లు ఈ ప్రాంతపు



రైతాంగానికి చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. కొంతమంది ప్రజా ప్రతినిధులు ఆనాడు వైయస్సార్ ప్రభుత్వం శంకుస్థాపన చేసిందని తెలుపుతున్నారు కానీ గత ప్రభుత్వం 90 శాతం పూర్తి చేసిన ప్రాజెక్టు మీరెందుకు మిగతా పది శాతం నిధులు కేటాయించి పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. పూలు జల్లడం, కొబ్బరికాయలు కొట్టడం కాకుండా అసెంబ్లీలో బస్వాపురం ప్రాజెక్టుకు జరుగుతున్న అన్యాయంపై గలమెత్తి నిధులు వచ్చే విధంగా ఆందోళన చేపట్టాలని జిల్లాలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలను నర్సింహ కోరినారు. ఇప్పటికైనా ప్రాజెక్టులో భూములు, ఇండ్లు కోల్పోతున్న రైతులు, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క మాటలను నమ్మకుండా ప్రాజెక్టు పూర్తి సాయి నిర్మాణం కోసం, నిర్వాసితులకు రావలసిన నష్టపరిహారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని నర్సింహ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు కొండ అశోక్, శాఖ కార్యదర్శి కూకుట్ల కృష్ణ పాల్గొన్నారు.

# ప్రజా తీర్పును గౌరవించి.. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలి

### మెజారిటీ మాదే.. చైర్మన్ పీఠం మాదే! : మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

**రామకృష్ణాపూర్ మార్చి 22 (క్రైమ్ మిర్రర్):** క్యాతనపల్లి మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని, ప్రజలిచ్చిన తీర్పును గౌరవించకుండా కాలయాపన చేస్తోందని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ఉద్రిక్తతల నేపథ్యంలో నమోదైన కేసులో హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడంతో, ఆదివారం ఆయన రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో హాజరై సంతకం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ వెంకటస్వామి కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని సుమన్ ఆరోపించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన 25 మంది



నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. బెయిల్‌పై విడుదలైన తర్వాత కూడా కోర్టు నిబంధనల సాకుతో నిత్యం పోలీస్ స్టేషన్లకు పిలుస్తూ వేధిస్తున్నారని, ఇది రాక్షసానందం తప్ప మరొకటి కాదని దుయ్యబట్టారు.హైకోర్టు ఆదేశాల ప్రకారం ఈ నెల 24వ తేదీ లోపు క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు పంపాల్సిన సమ్మతి పత్రాన్ని ఉద్దేశపూర్వకంగా నిలిపివేస్తూ ఎన్నికలను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.క్యాతనపల్లి ప్రజలు బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఇచ్చారు. 22 వార్డుల్లో 14 స్థానాలు గెలిచి మేము బలంగా ఉన్నాము. కేవలం 7 వార్డులకే పరిమితమైన కాంగ్రెస్, అధికార బలంతో కౌన్సిల్ హాల్‌లో ఉద్రిక్తతలు సృష్టించి, మా పై లాఠీఛార్జ్ చేయించడం దుర్మార్గం" అని సుమన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామాల వల్ల తమ కౌన్సిలర్లు గత 35 రోజులుగా ఇళ్లకు దూరంగా ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.ఈ అన్యాయంపై త్వరలోనే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. అలాగే రాబోయే అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో క్యాతనపల్లితో పాటు ఇబ్రహీంపట్నం, ఖానాపూర్ మున్సిపాలిటీల ఎన్నికల అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. ఎన్ని కుతంత్రాలు చేసినా క్యాతనపల్లి చైర్మన్ పదవిని బీఆర్ఎస్, వైస్ చైర్మన్ పదవిని సీపీఐ దక్కించుకోవడం ఖాయమని బాల్క సుమన్ ధీమా వ్యక్తం చేశారు.



## ఆర్థిక సహాయం అందజేత

క్రైమ్ మిర్రర్ వలిగొండ:యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన పత్తేపు యాదగిరి గుండె మరియు కిడ్నీ సమస్యతో చాలా రోజుల నుండి బాధపడుతూ అనారోగ్యంతో మరణించారు,వారి యొక్క కుటుంబ సభ్యులకి ఏ జే ఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో 5,000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,యువత,ఏ జే ఆర్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పాసికంటి శ్రీనివాస్ కు రాష్ట్రస్థాయి పురస్కారం.....

**. ఆలేరు మార్చి 21:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణానికి చెందిన పద్మశాలి సంఘం అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం (టి ఆర్ పి ఎస్) రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాలు 2026 లభించింది. తెలంగాణ ప్రభుత్వ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పద్మశాలి టెక్స్టైల్, లైఫ్ స్టైల్, వి ఎం ఎన్, టిఆర్పిఎస్ , జాతీయ చేనేత ఐక్యవేదిక సంస్థలు సంయుక్తంగా సేవా సంఘంలో కృషిచేసిన వారికి అందజేసే ఈ రాష్ట్రస్థాయి పురస్కారాన్ని హైదరాబాద్ ఎల్బీనగర్ కె.బి.ఆర్ ఫంక్షన్ హాల్ లో కార్యక్రమంలో ప్రముఖ చలనచిత్ర నటులు , మాజీ మంత్రి బాబు మోహన్ చేతుల మీదుగా ఈ అవార్డును శ్రీనివాస్ కు అందజేశారు. రాష్ట్రస్థాయి అందుకున్నందుకు శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు వల్లకాటి రాజకుమార్ మరియు జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపోలు వీర మోహన్, అలాగే ఎక్స్ నిర్వాహకులు మార్త రమేష్, ఇప్పలపల్లి రమేష్, శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

## తెలంగాణ విద్య సమితి ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ ఫెయిర్

### ముఖ్యఅతిథి నగర మేయర్ పునకొల్లు నీరజ

**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** తెలంగాణ విద్య సమితి ఆధ్వర్యంలో స్వర్ణభారతి ఫంక్షన్ హల్ నందు జరిగిన ఎడ్యుకేషన్ ఫెయిర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథి నగర మేయర్ పునకొల్లు నీరజ హాజరయ్యారు వారి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించటం జరిగింది.ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ యూనివర్సిటీలు ఒకే వేదికలో పాల్గొనటం విద్యార్థులకు తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగం మరియు అన్ని వివరాలు తెలుసుకోవటనికి చక్కని అవకాశం అని అన్నారు . మారుతున్నా కాలాన్ని బట్టి విద్యార్థులు కోర్స్ ఎన్నుకోవడం పట్ల జాగ్రత్త వహించాలని తెలిపారు.ఈ కార్యక్రములో ఐసిఎఫ్ఏఐ మల్లారెడ్డి,కేఎల్ యూనివర్సిటీ ఏఎంఐటివై పిపిఎస్ యు ఎన్ ఐ ఎం ఎస్ యూనివర్సిటీ తో పాటు పాలు యూనివర్సిటీలు పాల్గొన్నారు ఈ కార్యక్రమములో తెలంగాణ విద్య సమితి అధ్యక్షులు తారక్ గౌడ్ ,కార్పొరేటర్ వైష్ణవి ప్రసన్నకుమార్ , అమరగని వెంకట్ గౌడ్ , నాగరాజు గౌడ్ , గణేష్ నాయక్ , వెంకీ నాయుడు , మురళి , శ్రీనివాస్ గౌడ్ , శ్యామ్ రెడ్డి ,వట్టికొండ శ్రీనివాస్ మరియు విద్యార్థులు తల్లిదండ్రులు పలువురు విద్యావంతులు పాల్గొన్నారు .




## అనధికార ఫ్లెక్సీల తొలగింపులో అసమానతలపై ఫిర్యాదు చేసిన సీతారాం ధూళిపాళ


**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు బీఆర్ఎస్ పార్టీ మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ వినతి పత్రం సమర్పించారు. అనధికార ఫ్లెక్సీల తొలగింపులో అధికార యంత్రాంగం తటస్థంగా వ్యవహరించడం లేదని ఆయన ఆరోపించారు.గతంలో అన్ని రాజకీయ పార్టీలకు సమానంగా వ్యవహరిస్తామని అధికారులు హామీ ఇచ్చినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో అది అమలులో కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీలను 24 గంటల్లో తొలగించినప్పటికీ, అధికార పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీలు మణికొండ, నెక్కనం పూర్ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.చట్టపరంగా అన్ని పార్టీలకు ఒకే విధంగా నిబంధనలు అమలు చేయాలని, పాక్షికతకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇటువంటి అసమాన చర్యలు ప్రజల్లో పరిపాలనపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయని తెలిపారు. అందువల్ల, రాజకీయ పార్టీ భేదం లేకుండా అన్ని అనధికార ఫ్లెక్సీలను సమానంగా తొలగించాలని డిప్యూటీ కమిషనర్‌ను సీతారాం ధూళిపాళ విజ్ఞప్తి చేశారు.....

## శిల్పారామం లో ప్రేక్షకులను అలరించిన డాక్టర్ ప్రసన్న రాణి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన...

**మాదాపూర్ క్రైమ్ మిర్రర్ :** శిల్పారామం మాదాపూర్ లో శ్రీమతి అంజనా చౌదరి ఆధ్వర్యం లో "సృజన ఉగాది సంబరాలు" రెండవ రోజు ముగింపు కార్యక్రమంలో శ్రీమతి వడలి లక్ష్మి చే వేణువు కచేరి మరియు డాక్టర్ ప్రసన్న రాణి శిష్య బృందం చే కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. వినాయక కౌతం, కళింగ నర్తన తిల్లాన, జతిస్వరం, దేవ దేవం భజే, అలరులు కురియగా, తరంగం, బాల కనకయ్య, చక్కని తల్లికి, త్రిమాత కౌతం, నీల మేఘ శరీర, పలుకే బంగారమాయె న, పుష్పాంజలి, కృష్ణ శబ్దం మొదలైన అంశాలను మేధా, శ్రీ లాస్య, యుక్త, పూజ, హేమాన్య, కృతిక, వర్షిణి, సౌజన్య, ప్రియాంక, వేర్నికా, హర్షిత, విజయ మాధవి, సుష్మ, స్వాతి మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.



క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595





## రిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

### రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మంద మకరందు

**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రజలు తమ ఇంట్లోని చెత్తను రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో వేయవద్దు అని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మంద మకరందు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యచరణలో భాగంగా ఆదివారం స్వచ్ఛ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పీరంచెరువు ప్రాంతంలో ప్రత్యేక శుభ్రత చర్యలు చేపట్టారు. చెరువులో పేరుకుపోయిన చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లను తొలగిస్తూ స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించారు. పీరంచెరువులో డ్రోన్ సాయంతో యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాప్తి చెందకుండా ఉండేందుకు చెరువులో యాంటీ లార్వా మందులు పిచికారీ చేయిస్తున్నామన్నారు. పిబిఈఎల్ సిటీ అపార్ట్మెంట్ వాసులు, స్థానిక కాలనీ వాసులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని శుభ్రత కార్యక్రమానికి సహకరించారు. ఫాగడింగ్ ద్వారా దోమలను తాత్కలికంగా మాత్రమే నియంత్రివచ్చని, కానీ ఏఎల్వో ఆపరేషన్ ద్వారా దోమల పెరుగుదలను పూర్తిగా అడ్డుకోవచ్చని తెలిపారు. పీరంచెరువును వారం రోజుల్లో పూర్తిగా శుభ్రపరిచి, జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అనంతరం జోనల్ కమిషనర్ చెరువు వాకింగ్ ట్రాక్పై సిబ్బందితో కలిసి నడుచుకుంటూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అదే సమయంలో వాకింగ్ ట్రాక్ సమీపంలోని కాళీమందిర్ వద్ద ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ముగ్గురు చిన్నారులు యోగా చేస్తుండడం గమనించి వారి తల్లిదండ్రులను అభినందించారు. ఇంటింటికి చెత్త ఆటోలు వెళు_న్నాయా లేదా అని ప్రజలని అడిగి తెలుసుకున్నారు. చెరువులో చెత్త చదరం వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి, డిపిఓ స్వాతి, ట్రైనీ గ్రూప్ వన్ ఆఫీసర్లు, యు. సి. డి. టీం, ఎంటమాలజీ, డిపార్ట్మెంట్, శానిటేషన్ డిపార్ట్మెంట్, ఈ ఎం ఓ హెచ్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు....

## భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా పీజేఆర్ స్టేడియంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న..

**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్..**



శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ : ఈరోజు స్వాతంత్ర సమరయోధులు, దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా స్టీఫెన్ వారి సన్నిహితుల ఆధ్వర్యంలో పీజేఆర్ స్టేడియంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈరోజు భగత్ సింగ్ గారి వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించిన నిర్వాహకులను అభినందిస్తూ దేశం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ గారి వర్ధంతి ఇంత ఘనంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణమని, భగత్ సింగ్ గారి లాంటి వారు చేసిన ప్రాణ త్యాగల ఫలితమే ఈరోజు మనం ఆస్వాదిస్తున్న స్వాతంత్రం అని అన్నారు, ఆయన జీవితం మన ప్రధాని మోదీ కి ,మాలాంటి ఎంతో మంది నాయకులకు స్ఫూర్తి అని, మనం కూడా ఆయన స్ఫూర్తి తో దేశం కోసం దేశా అభివృద్ధి కోసం మనం కూడా ఎంతో కొంత మన బాధ్యతలను నిర్వహించాలన్నారు. ఈరోజు రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేసి, సంవత్సరంలో కనీసం ఒకటి రెండు సార్లైన బ్లడ్ డొనేట్ చేయాలని దీని వలన కొత్త రక్తం ఉత్పత్తి అయ్యి మనం కూడా చాలా ఆరోగ్యంగా ఉంటామన్నారు, ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అర్జున్, స్టీఫెన్, ప్రభాకర్, శివ, బంటి, మరియు వారి సన్నిహితులు పాల్గొన్నారు.

# భారతదేశంపై ఇరాన్-అమెరికా యుద్ధ ప్రభావం

ప్రపంచ పటంలో మధ్యప్రాచ్యం ఎప్పుడూ ఒక రగిలే అగ్నిపర్వతమే. కానీ ఇప్పుడు ఆ అగ్నిపర్వతం విస్ఫోటనానికి సిద్ధంగా ఉందా? అన్న ప్రశ్న ప్రపంచ దేశాల మేధావులను వేధిస్తోంది. అమెరికా అధ్యక్ష పీఠంపై డొనాల్డ్ ట్రంప్ తన రెండవ ప్రస్థానాన్ని ప్రారంభించిన వేళ, వైట్ హౌస్ నుండి వెలువడుతున్న సంకేతాలు మునుపెన్నడూ లేనంత గంభీరంగా ఉన్నాయి. మేము దేనికైనా సిద్ధం అన్న ట్రంప్ హెచ్చరికలు కేవలం మాటలకే పరిమితం అవుతాయా లేక పశ్చిమ ఆసియా ఆకాశంలో క్షిపణుల గర్జనలు వినిపిస్తాయా? అసలు ట్రంప్ దృష్టి ఇరాన్ మీద అంత కఠినంగా ఎందుకు ఉంది? ఈ ఉద్రిక్తతల వెనుక ఉన్న అసలు గేమ్ ప్లాన్ ఏమిటి?అమెరికా ఇరాన్ మధ్య వైరం నిన్న మొన్నటిది కాదు. ఇది దశాబ్దాల నాటి చేదు జ్ఞాపకం. 1979లో ఇరాన్‌లో వచ్చిన ఇస్లామిక్ విప్లవం ఈ రెండు దేశాల మధ్య స్నేహ వారధిని కూల్చేసింది. అప్పటి నుండి మొదలైన ఈ కోల్డ్ వార్ , ట్రంప్ మొదటి పాలనలో (2017-2021) పతాక స్థాయికి చేరుకుంది.గుర్తుందా? 2018లో అప్పటికే అమల్లో ఉన్న ఇరాన్ అణు ఒప్పందం (జేబ్యూహా) నుండి ట్రంప్ ఏకపక్షంగా బయటకు వచ్చారు. అది చాలదన్నట్లు, ఇరాన్ గర్వించే సైనిక మేధావి జనరల్ ఖాసిమ్ సులేమానీని 2020లో డ్రోన్ దాడితో హతమార్చడం ద్వారా అమెరికా తన ఉగ్రరూపాన్ని చూపింది. ఇప్పుడు 2025లో మళ్ళీ అధికారంలోకి వచ్చిన ట్రంప్, తన పాత గరిష్ఠ ఒత్తిడి (మ్యఇఅఎబఎ ౯ాతీవంంబతీవ) మంత్రాన్ని మరింత పదును పెడుతున్నారు. ఇది కేవలం దౌత్య యుద్ధం కాదు, యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న సమయం.ట్రంప్ వ్యాపారకర్తగా ఆలోచిస్తారు. ఆయన ప్రతి అడుగు వెనుక ఒక బలమైన కారణం ఉంటుంది. ఇరాన్ విషయంలో ఆయన దూకుడుకు ఐదు ప్రధాన స్తంభాలు ఉన్నాయి,ప్రపంచ అణు శక్తి సంస్థ (IAEA) లెక్కల ప్రకారం, ఇరాన్ తన యురేనియంను 60 శాతానికి పైగా సుసంపన్నం చేసింది. అణు బాంబు తయారు చేయడానికి 90 శాతం సుసంపన్నత చాలు. అంటే, ఇరాన్ అణు స్వప్నానికి కూతవేటు దూరంలో ఉందన్నమాట. ఇరాన్ చేతికి అణ్వాయుధం చిక్కితే, మధ్యప్రాచ్యంలో అమెరికా మాటకు విలువుండదు. అందుకే, ఆ బాంబు తయారీ కాకముందే దాన్ని నాశనం చేయాలనేది ట్రంప్ అసలు ప్లాన్. ట్రంప్ మరియు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మధ్య ఉన్న అనుబంధం జగద్విదితం. ఇరాన్ అణు కేంద్రాలను నేలమట్టం చేయాలని ఇజ్రాయెల్ ఎప్పటి నుంచో తహతహలాడుతోంది. కానీ, అమెరికా అండ లేకుండా అది అసాధ్యం. ఇప్పుడు ట్రంప్ రూపంలో ఇజ్రాయెల్‌కు ఒక బలమైన మిత్రుడు దొరికాడు. ఈ ఇద్దరు కలిస్తే ఇరాన్ మ్యాప్ మారిపోవడం ఖాయమన్నది విశ్లేషకుల మాట. మధ్యప్రాచ్యంలో ఇరాన్ ఒక శక్తివంతమైన షాడో కింగ్ లా వ్యవహరిస్తోంది. హమాస్, హెజ్బుల్లా, హూతీ రెబల్స్.ఇలా ఎక్కడ అలజడి జరిగినా దాని వెనుక ఇరాన్



హస్తం ఉంటుందని అమెరికా గట్టి నమ్మకం. సౌదీ అరేబియా వంటి అమెరికా మిత్ర దేశాలను కాపాడుకోవాలంటే, ఇరాన్ రెక్కలు విరవక తప్పదు. ఇరాన్ ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలున్న దేశాలలో ఒకటి. ఆంక్షల ద్వారా ఇరాన్ ఆర్థిక వెన్నెముకను విరిచి, ప్రపంచ మార్కెట్లో చమురు ధరలను తన నియంత్రణలోకి తెచ్చుకోవాలని ట్రంప్ భావిస్తున్నారు. ఇది ఆర్థిక ఆధిపత్యం కోసం జరుగుతున్న పోరాటం కూడా. అమెరికా ఓటర్లకు ట్రంప్ ఒక స్ట్రాంగ్ మ్యాన్ . శత్రువుల కళ్లలోకి చూసి హెచ్చరించే నాయకుడిగా తన ఇమేజ్‌ను కాపాడుకోవడానికి ఇరాన్ ఒక గొప్ప వేదిక. అమెరికా ఫస్ట్ అనే నినాదంతో ఆయన తన దేశ ప్రజల మద్దతును కూడగట్టుకుంటున్నారు.అమెరికా బెదిరింపులకు ఇరాన్ భయపడిపోతోందని అనుకుంటే పొరపాటే. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ మరియు సర్వోన్నత నేత ఆయతుల్లా ఖమేనీ తమ వైఖరిని స్పష్టం చేశారు. మా హక్కులను ఎవరూ లాక్కోలేరు అని వారు గర్జిస్తున్నారు. ఒకవేళ అమెరికా దాడి చేస్తే, ప్రపంచ వ్యాప్తంగా చమురు సరఫరా అయ్యే హర్మూజ్ జలసంధి ని మూసివేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఇదే కనుక జరిగితే, ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడం ఖాయం. ఎందుకంటే 20% ప్రపంచ చమురు అక్కడి నుంచే రావాలి.యుద్ధం ఎప్పుడు మొదలవుతుందో ఎవరూ చెప్పలేరు కానీ, మొదలైతే ఎంత కాలం సాగుతుందనే దానిపై రెండు రకాల అంచనాలు ఉన్నాయి. కేవలం ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా లేదా ఇజ్రాయెల్ మెరుపు దాడులు చేయవచ్చు. ఇది ఒకట్రెండు రోజుల్లో ముగిసే ప్రహసనం కావచ్చు. ఒకవేళ ఇరాన్ ఎదురుదాడికి దిగితే, అది లెబనాన్, యెమెన్, సిరియా మీదుగా మధ్యప్రాచ్యం అంతటా విస్తరిస్తుంది. రష్యా మరియు చైనా గనుక ఇరాన్‌కు అండగా నిలిస్తే, అది మన కళ్ల ముందే మూడవ ప్రపంచ యుద్ధానికి (World War III) నాంది కావచ్చు.మనం ఎక్కడో దూరంగా ఉన్నాం కదా అని అనుకోవడానికి వీలు లేదు. ఇరాన్అమెరికా యుద్ధం జరిగితే మన వంటిళ్లలో మంటలు చెలరేగుతాయి.చమురు సరఫరా ఆగితే పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని తాకుతాయి. ఫలితంగా నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుడి నడ్డి విరుగుతుంది.ఇరాన్‌లో భారత్ భారీగా పెట్టుబడి పెట్టిన చబహార్ ఓడరేవు ప్రమాదంలో పడుతుంది. ఇది మన వ్యూహాత్మక వాణిజ్యానికి పెద్ద దెబ్బ. గల్ఫ్ దేశాలలో ఉన్న లక్షలాది మంది భారతీయుల భద్రత ప్రశ్నార్థకమవుతుంది. వారి ఉద్యోగాలు పోతే మన దేశ ఆర్థిక వ్యవస్థకు వచ్చే విదేశీ మారక ద్రవ్యం నిలిచిపోతుంది. ప్రస్తుతానికి పరిస్థితి కత్తి మీద సాము లా ఉంది. ఒకవైపు యుద్ధ ట్యాంకులు సిద్ధమవుతుంటే, మరోవైపు ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు శాంతి చర్చల కోసం తలుపులు తడుతున్నాయి. ట్రంప్ కోరుకుంటున్నది పూర్తి నిరాయుధీకరణ ,ఇరాన్ కోరుకుంటున్నది ఆత్మగౌరవం . ఈ రెండింటి మధ్య రాజీ కుదరకపోతే ప్రపంచం ఒక చీకటి అధ్యాయంలోకి జారిపోయే ప్రమాదం ఉంది.శాంతి అనేది ఒక ఆప్షన్ కాదు, అది ఒక అవసరం. యుద్ధం వల్ల ఎవరూ గెలవరు, కేవలం శవాల దిబ్బలు మాత్రమే మిగులుతాయి. ప్రపంచ నాయకులు అహంకారాన్ని వీడి, ఆయుధాలను పక్కన పెట్టి, అవగాహనతో ముందుకు సాగాలని ఆశిద్దాం. ఎందుకంటే, మరో యుద్ధం భరించే శక్తి ఈ భూగోళానికి లేదు!

**డా .సూర్యదేవర రామకృష్ణ ,**

**9490754169**

తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నం సాకారమై దశాబ్దం దాటింది. నీళ్లు, నిధులు, నియామకాల నినాదం నుంచి బంగారు తెలంగాణ దిశగా అడుగులు పడుతున్నాయని పాలకులు చెబుతున్న వేళ, సామాన్యుడికి అత్యంత భారంగా మారిన అంశం ఆరోగ్యం . కోట్లాది రూపాయల బడ్జెట్ కేటాయింపులు, గడప గడపకూ వైద్యం అంటూ వినిపిస్తున్న నినాదాల వెనుక ప్రభుత్వ ఆసుపత్రి మెట్లెక్కిన పేదవాడి కళ్లలో మాత్రం ఇంకా ఆందోళన తలదాచుకుంటూనే ఉంది. గాంధీ ఆసుపత్రి కారిడార్లలో వినిపించే రోదనలు, ఆదిలాబాద్ అడవుల్లో సరైన వైద్యం అందక మంచానికే పరిమితమైన గిరిజన బిడ్డల గాథలు నేటికీ మన వ్యవస్థకు అద్దం పడుతున్నాయి. అసలు మన ప్రభుత్వ వైద్యం ఎటు వెళ్తోంది? అంకెలు చెబుతున్న అభివృద్ధికి, క్షేత్రస్థాయిలో ఉన్న దయనీయ స్థితికి మధ్య ఉన్న అగాధమెంత?

**అంకెల గారడీ మౌలిక సదుపాయాల వెరడి:**

# ఆరోగ్య తెలంగాణ: అంకెల్లో ప్రగతి.. ఆసుపత్రుల్లో దుస్థితి!

ప్రభుత్వ లెక్కల ప్రకారం తెలంగాణలో 75 జిల్లా ఆసుపత్రులు, 93 ప్రాంతీయ ఆసుపత్రులు, 688 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, మరియు దాదాపు 2,700 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (౯ాఎజ) సేవలు అందిస్తున్నాయి. వినడానికి ఈ సంఖ్యలు చాలా ఆశాజనకంగా ఉన్నప్పటికీ, లోపలికి వెళ్లి చూస్తేనే అసలు రంగు బయటపడుతుంది. చాలా ఆసుపత్రులు కేవలం భవనాలుగా మిగిలిపోయాయి. కొన్నిచోట్ల గోడలు ఉన్నాయి కానీ డాక్టర్లు లేరు, మరికొన్ని చోట్ల డాక్టర్లు ఉన్నా అవసరమైన మందులు ఉండవు. ఆధునిక వైద్య పరికరాలు ధూళి పట్టి ఉండటం, స్కానింగ్ మిషన్లు రిపేర్ల సాకుతో మూలన పడటం నిత్యకృత్యం.పొద్దున్నే వచ్చి లైన్ లో నిలబడతాం. డాక్టరు గారు ఎప్పుడు వస్తారో తెలియదు. వచ్చినా కనీసం రెండు నిమిషాలు కూడా చూడరు. రాసిచ్చిన మందులు ఇక్కడ ఉండవు, బయట షాపులో కొనుక్కోవాలంటారు. మా లాంటి పేదోళ్లకు రోగం వస్తే చావడం తప్ప మరో దారి లేదాయె. అని భువనగిరిలో కలిసిన ఓ వృద్ధ రైతు ఆవేదనగా చెప్పారు. ఇది ఒక్కరి మాట కాదు, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది సామాన్యుల గుండె కోత.

**గాంధీ, ఉస్మానియా: ఆశల వారధులు సమస్యల నిధులు**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులు దక్షిణ భారతదేశానికే తలమానికం. రోజూ సుమారు 5,000 మంది రోగులు ఇక్కడికి వస్తుంటారు. కార్పొరేట్ ఆసుపత్రుల వేల రూపాయల ఫీజులు భరించలేని వారికి ఇవే దేవాలయాలు. కానీ, ఇక్కడి పరిస్థితులు అత్యంత హృదయ విదారకం. అవుట్ పేషెంట్ విభాగంలో గంటల తరబడి నిలబడటం వల్ల రోగుల పరిస్థితి మరింత విషమిస్తోంది. బెడ్లు దొరక్క కారిడార్లలో నేలపైన, మెట్ల కింద పడుకుని చికిత్స పొందుతున్న దృశ్యాలు చూస్తుంటే మనం 21వ శతాబ్దంలోనే ఉన్నామా? అనే అనుమానం కలుగుతుంది. డ్రైనేజీ లీకేజీలు, అపరిశుభ్రమైన వార్డులు రోగులకు కొత్త రోగాలను ప్రసాదిస్తున్నాయి.

**పల్లె వైద్యం.. పడకేసిన వ్యవస్థ**

నగరాల పరిస్థితి ఇలా ఉంటే, పల్లెల్లో పరిస్థితి వర్ణనాతీతం. ముఖ్యంగా మహబూబ్‌నగర్, ములుగు, కుమురం భీమ్ ఆసిఫాబాద్ వంటి వెనుకబడిన జిల్లాల్లో గిరిజన ప్రాంతాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు. అనేక ౯ాఎజలలో డాక్టర్లు సకాలంలో అందుబాటులో ఉండరు. 108 వాహనం వచ్చే లోపే ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న ఉదంతాలు అనేకం. ప్రసవం వంటి అత్యవసర సమయాల్లో 60-80 కిలోమీటర్ల దూరం ఉన్న జిల్లా ఆసుపత్రికి వెళ్లేలోపు తల్లీబిడ్డల ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోతున్నాయి. మాతా శిశు మరణాల రేటును తగ్గించామని ప్రభుత్వం చెబుతున్నా, గిరిజన గూడాల్లో నేటికీ నేల ప్రసవాలే దిక్కు కావడం సిగ్గుచేటు.

**గణాంకాలు చెబుతున్న కఠిన వాస్తవం**

మనం ఒకసారి గణాంకాలను గమనిస్తే, వ్యవస్థలో ఉన్న లోపాలు స్పష్టంగా కనిపిస్తాయి:,వైద్యుల కొరత ఎక్కువగా వుంది రాష్ట్రంలో ప్రతి 10,000 మంది జనాభాకు కేవలం 5.8 మంది ప్రభుత్వ వైద్యులు మాత్రమే ఉన్నారు. నియామకాలకు ఖాళీలు ఎదురుచూస్తున్నాయి సుమారు 35% ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి.బడ్జెట్ కేటాయింపులు లోను మొండిచేయి ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) ప్రమాణాల ప్రకారం బడ్జెట్‌లో 8% ఆరోగ్యానికి కేటాయించాలి, కానీ మన రాష్ట్రంలో అది కేవలం 4.2% మాత్రమే.ఆయుష్మాన్ భారత్ లో ఈ పథకం కింద లబ్ధిదారుల్లో కేవలం 40% మందికే అవగాహన ఉండటం విచారకరం.

**అప్పుల ఊబిలో ఆరోగ్య శ్రీ**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్య శ్రీ పథకం ఎంతోమందికి పునర్జన్మ నిచ్చింది. ముఖ్యంగా గుండె ఆపరేషన్లు, కిడ్నీ సమస్యల విషయంలో ఈ పథకం ఒక వరం. కానీ, ఈ పథకం అమలులో పారదర్శకత కరువైంది. ప్రైవేట్ ఆసుపత్రులు అనవసరమైన పరీక్షలు చేసి, బిల్లులు పెంచి ప్రభుత్వ ఖజానాను గుల్ల చేస్తున్నాయి. మరోవైపు, అక్షరాస్యత లేని గ్రామీణ ప్రజలకు ఈ పథకం పొందడానికి అవసరమైన ధృవపత్రాల సేకరణ ఒక పెద్ద ప్రహసనంగా మారింది.

నా భర్తకు ఆపరేషన్ కావాలి. ఆరోగ్య శ్రీ ఉందని ఆశతో వచ్చాం. కానీ ఫారం నింపడానికి, ఆఫీసుల చుట్టూ తిరగడానికి మాకు ఎవరూ సాయం చేయలేదు. చివరకు అప్పు చేసి ప్రైవేట్ లో చూపించాం, అని పెద్దపల్లికి చెందిన ఒక మహిళ కన్నీరు మునిగింది. ఆరోగ్య శ్రీ ఉన్నా, చికిత్స కోసం పేదలు అప్పులు చేయాల్సిన పరిస్థితి రావడం వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం.

**మూలకారణం ఏమిటి?**

ప్రభుత్వ వైద్యం నిర్వీర్యం కావడానికి ప్రధాన కారణం వైద్యుల కొరత మరియు అధికారుల నిర్లక్ష్యం . వీదీదూ చదివిన యువ వైద్యులు పల్లెల్లో పనిచేయడానికి ఇష్టపడటం లేదు. ప్రైవేట్ సె క్టార్ లో వచ్చే భారీ వేతనాల ముందు ప్రభుత్వ సర్వీస్ చిన్నబోతోంది. అలాగే, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనలో రాజకీయ చిత్తశుద్ధి లోపించింది. కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చే రాయితీల్లో కనీసం కొంతైనా ఆరోగ్య రంగానికి కేటాయిస్తే పరిస్థితులు మెరుగుపడతాయి.

**మార్పు ఎక్కడ మొదలవ్వాలి?**

సమస్యలు పర్వతంలా ఉన్నా, పరిష్కారం అసాధ్యం కాదు. కావాల్సిందల్లా సమగ్రమైన సంస్కరణలు .ఖాళీగా ఉన్న వైద్య, నర్సింగ్ పోస్టులను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ప్రతి ఆసుపత్రిలో అవసరమైన మందుల నిల్వలను ఆన్‌లైన్‌లో పర్యవేక్షించాలి. ఏ మందు లేదన్నా బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. రోగుల ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేయడం ద్వారా చికిత్స ప్రక్రియను వేగవంతం చేయవచ్చు.ఆరోగ్య శ్రీ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రుల లైసెన్సులను రద్దు చేయాలి. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి కనీసం 8% నిధులు కేటాయించాలి.

**ఆరోగ్యం హక్కు.. దయ కాదు!**

మనం ఎన్ని సంపదలు సృష్టించినా, ప్రజల ఆరోగ్యం బాగున్నప్పుడే ఆ సంపదకు విలువ ఉంటుంది. ప్రభుత్వ ఆసుపత్రులు కేవలం భవనాలు కాదు, అవి పేదవాడి నమ్మకానికి చిరునామాలు. ఆ నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. చికిత్సను ఒక దానంగా కాకుండా, రాజ్యాంగం కల్పించిన హక్కుగా చూడాలి. గాలిలో దీపంలా మారిన సామాన్యుడి ఆరోగ్యాన్ని కాపాడటానికి ప్రభుత్వాలు, వైద్యులు, మరియు స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాలి. అప్పుడే అందరికీ ఆరోగ్యం అనే నినాదం నిజమవుతుంది. తెలంగాణ బిడ్డలందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే స్వరాష్ట్ర కల పరిపూర్ణమవుతుంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.